క్లుప్తంగా

సుబ్రమణ్యస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

సదుం: మండల కేంద్రంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో కృష్ణ పక్షం మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేక పూజల అనంతరం పరిమళ భరిత పుష్పమాలికలు, పట్టు పీతాంబరాలు, వెండి కవచాలతో సుందరంగా అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంచారు.

బోయకొండలో జెడ్పీ చైర్మన్ పూజలు


ఆలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి స్వాగతం పలికారు. ప్రత్యే పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అర్చకులు అమ్మవారి ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి చారిత్రాత్మకమని కొనియాడారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ సభ్యుడు సభ్యుడు రాయల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన



బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావితమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో చెత్తాచదారం, పిచ్చిమొక్కలు, టైర్లు, కొబ్బరిచిప్పలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమతెరలను తప్పకుండా వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని తెలిపారు. జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా రక్తపరీక్షలు చేసుకోవాలన్నారు. అతిసారా, వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది లక్ష్మి, ముబీనా, రాజేశ్వరి, జయమ్మ, భారతి పాల్గొన్నారు.

సకాలంలో సేవలు అందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: సమస్యల వినతులను సచివాలయ సిబ్బంది త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ యువరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని ఓగు,ఎస్ బండపల్లె గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలను అందించాలని సూచించారు. వలంటీర్లు వారంలో 3 రోజులు తప్పనిసరిగా సచివాలయానికి హాజరై ప్రజలకు సకాలంలో సేవలు అందించాలన్నారు.

సూపర్ వైజర్‌కు సన్మానం


సన్మానం అందుకున్న మధు దంపతులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ జి. మధు పలమనేరు మండలం కొలమాసనపల్లి పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో వైద్యశాఖ సిబ్బంది మధు దంపతులను శాలువలు, పూలమాలలతో సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. వైద్యాధికారులు నిరంజన్ కుమార్, మురళీకృష్ణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి కొబ్బరి చెట్టుపై మంటలు

సదుం: మండలంలోని నడిగడ్డ గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపడింది. గ్రామంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గ్రామ సమీపంలోని చాకలివానికుంట ఎదురుగా ఉన్న మామిడితోటలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు రేగాయి. స్థానికులు తొలుత భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోక పోవడంతో హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

సర్కార్ బడుల్లో కార్పొరేట్ విద్య


పలమనేరు : కిట్లు అందుకున్న విద్యార్థినులతో చైర్‌పర్సన్ పవిత్ర


పుంగనూరు : కిట్లను పంపిణీ చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, అమ్ము

పలమనేరు: సర్కారు బడుల్లో చదువుకునే పేద పిల్లలు సైతం ఉన్నత విద్యావంతులై ప్రపంచాన్ని ఏలాలనే సంకల్పంతోనే కార్పొరేట్ స్థాయి విద్య ను ప్రభుత్వం అందిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చి, జగన్న విద్యా కానుకలను అందించి, అమ్మఒడి ద్వారా సాయం చేసి, గోరుముద్ద ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. నేడు పేదపిల్లలు ఏ ఇబ్బంది లేకుండా బడులకు వస్తున్నారంటే అది కేవలం జగనన్న చలవేనన్నారు. పేదవారికి దూరంగా ఉన్న ఇంగ్లిష్‌మీడియం అందించి విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ మురళీకృష్ణ, ఎంఈవో లీలారాణి, కౌన్సిలర్లు హేమంత్‌పూర్ణిమ, రవి, గంగమ్మ గుడి చెర్మైన్ కండల నరేష్, విద్యాకమిటీ చైర్మెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. మంగళవారం కొత్తయిండ్లు హైస్కూల్‌లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో కలసి ఆయన జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. అలాగే 25వ వార్డులో కౌన్సిలర్ పూల త్యాగరాజు, సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్ జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. యాబి కాంపౌండ్‌లో కౌన్సిలర్ సాజిదాబేగం, మైనారిటీ నేత మహబూబ్‌బాషా కిట్లను పంపిణీ చేశారు. 3వ వార్డులో కౌన్సిలర్ మమత, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మణ్‌రాజు కిట్లను పంపిణీ చేశారు. కొత్తయిండ్లు హైస్కూల్‌లో చైర్మన్ మాట్లాడుతూ అడ్మిషన్ల కోసం ప్రభుత్వ పాఠశాలల వద్ద విద్యార్థులు క్యూకడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ప్రతి ఒక్కరికి విద్య అందించడమే ఆశయంగా ప్రభుత్వ పాలన జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రమణ్యం, కమిటీ చైర్మన్ షణ్ముగం, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ

చౌడేపల్లె: మండలంలోని మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో మంగళవారం వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. హెచ్‌ఎం నాగమల్లిక, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు ఉన్నత పాఠశాలలో

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లను స్థానిక సర్పంచ్ షకూర్ అందజేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రఫీ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి అహమ్మద్, ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, ప్రకాష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల పాఠశాలలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పంపిణీ చేశారు. అలాగే పదవ తరగతి లో 527 మార్కులు సాధించిన విద్యార్థికి నగదు బహుమతిగా రూ.5వేలను సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అందజేసి ప్రోత్సహించారు. అలాగే గఫూర్‌సాహెబ్ జ్ఞాపకార్థం కుమారుడు కరీముల్లా రూ.10 వేల విలువజేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. అదేవిధంగా బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన ముగ్గురికి నగదు బహుమతిగా పూర్వ విద్యార్థి హర్షిత రూ. 5వేలను అందజేశారు. ఎంఈవో హసన్‌బాషా, సర్పంచ్ ఇబ్రహీంఖాన్,హెచ్‌ఎం నాగార్జున, పాఠశాల కమిటీ చైర్మన్ సైఫూల్లాఖాన్, కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, కాలేషా పాల్గొన్నారు.


చౌడేపల్లె : కిట్లను పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి


రొంపిచెర్ల : కిట్లను అందజేస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

విద్యకు అత్యంత ప్రాధాన్యం


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యం కల్పించారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీ పరిధిలోని బిరుగుండ్లపల్లె, బిరుగుండ్లపల్లె తండా, నక్కబాలేపల్లె, పామన బోయినపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వివరించారు. ఇంటింటికీ ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్ అందించారు. గ్రామాల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పక్కా గృహాల మంజూరును వేగవంతం చేసి, లబ్ధిదారులకు బిల్లులను సకాలంలో మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. బిరుగుండ్లపల్లెలో గ్రామస్తులు విన్నవించిన సమస్యలపై స్పందిస్తూ ఎమ్మెల్సీ రూ.10 లక్షలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం బిరుగుండ్లపల్లె ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలపై విద్యార్థులను అడిగారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పాఠశాలల పునః ప్రారంభం రోజునే జగనన్న కానుక కిట్లను అందజేస్తున్నటు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ,అడ్మిషన్లకు డిమాండ్ పెరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, నేతలు రామకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, కేశవరెడ్డి,హరినాథ్ రెడ్డి, లక్ష్మణరెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి, సుబ్రమణ్యం, సుజాత, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో పాల్గొన్న పెద్దిరెడ్డి, నాయకులు

సదుం: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి, మళ్లీ జగనన్నను సీఎం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కష్టపడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సదుం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులకు సచివాలయాల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే అంశంపై పవర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వానికి, ఈప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులోని తేడాను వివరించారు. ఇవి ఇలానే కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ ఉషారాణి, కోఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణం స్పందించాలి


వినతులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పంరూరల్: సమస్యల వినతులపై సచివాలయాల సిబ్బంది తక్షణం స్పందించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం చీలేపల్లె సచివాలయంలో మున్సిపల్ పరిధిలోని 7, 8 వార్డుల సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ అర్హులందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందించాలని చెప్పారు. పథకాలు అందని అర్హులు ఉంటే వలంటీర్లు, సిబ్బంది గుర్తించాలన్నారు. మెప్మా సహకారంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చీలేపల్లి శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని వినతి రాగానే, చైర్మన్ స్పందిస్తూ మున్సిపల్ నిధులతో దారి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. త్వరలో బయోమెట్రిక్ పరికరాలు సైతం కొత్తవి ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించారు. కౌన్సిలర్లు నాగరాజు, గణపతి, నాయకులు వెంకటరామయ్య, చలపతి, చీలేపల్లిరవి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంఈఓ

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలను ఎంఈఓ హసన్‌బాషాతో కలసి ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న గోరు ముద్ద పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నట్లు తెలిపారు. పాఠశాలను త్వరలో నూతన భవనంలోకి మార్చనున్నారని పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

పలమనేరు: మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న 16 వలంటీర్ పోస్టులకు అర్హత కలిగిన వారు ఈనెల 13 నుంచి 18 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ ఆధారంగా ఈ నియామకాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 19న స్క్రూట్నీ, 21న ఇంటర్వ్యూలు, 23న నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

గంగవరం: మండలంలో ఖాళీగా ఉన్న 8 గ్రామ వలంటర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగవరం-2 (జనరల్), గుండుగల్లు- వన్ (జనరల్), పసుపత్తూరు- వన్(ఎస్సీ), పత్తికొండ-వన్(బీసీ), కలగటూరు-1 (జనరల్), దండపల్లె-1(బీసీమహిళ), కొత్తపల్లె-1(బీసీ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, 18–35 ఏళ్ల లోపు వయస్సున్న వారు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు బుక్, కులం, నివాసం, తదితర ధ్రువీకరణ పత్రాలను జతపరిచి ఈనెల 18వ తేదీ లోపు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన తరువాత 21, 22వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన వారికి 24వ తేదీన నియామక పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

మారెమ్మ ఆలయంలో హోమ పూజలు



పుంగనూరు: పట్టణంలోని బస్టాండు వద్ద వెలసిన శ్రీవిరూపాక్షి మారెమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. హోమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై చలిపిండి, నెయ్యిదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణకు 15 ఆటోలు


ఆటోలను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరిచేందుకు, ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ నుంచి మంగళవారం 15 ఆటోలు వచ్చినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామన్నారు. చెత్తను వేరుచేయడం, దాని ద్వా రా ఎరువును తయారు చేయడం, హానికర చెత్తను ధ్వంసం చేసే కార్యక్రమం కూడా చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఇళ్ల వద్దకు మున్సిపల్ చెత్త తరలింపు ఆటోలు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. పరిశుభ్ర పుంగనూరుకు ప్రజలు సహకరించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

సదుం: వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ నారాయణరెడ్డి అన్నారు. నడిగడ్డ సచివాలయంలో మంగళవారం వలంటీర్లను అభినందించి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందించిన దుస్తులు పంపిణీ చేశారు. మరింత మన్ననలు అందేలా పనిచేయాలని సూచించారు.

పండ్ల మొక్కల పంపిణీ


అధ్యాపక బృందంతో సైనికుడు ప్రవీణ్‌కుమార్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కోగిలేరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ సైనికుడు ప్రవీణ్‌కుమార్ పలు రకాల పండ్ల మొక్కలను మంగళవారం అందజేశారు. కాలుష్య నివారణ, పచ్చదనం పెంపునకు రేపటి తరాలకు ఉపయోగపడేలా మొక్కలను నాటాలనే లక్ష్యంతో ఈ చిరుసాయం చేసినట్లు ఆయన తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖరం, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా పదోన్నతి


భానుమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

సదుం: మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా పని చేస్తున్న భానుమూర్తిరావుకు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయన వడమాలపేటకు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, ఎంపీడీఓ వరప్రసాద్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, పుత్రాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఆయనను సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

మొగిలి శివాలయంలో చండీయాగం


చండీయాగం చేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిలో స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మకు ప్రత్యేక పూజార్చనల అనంతరం ఆలయ ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన శ్రీవిద్య, మహావిద్య ఉపాసకులు, ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ పీవీ. గౌరీశంకర్, ఆలిండియా పురోహిత్ సంఘం గౌరవ సలహాదారు పాణ్యం శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో చండీయాగాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్లూరు-రొంపిచెర్ల రోడ్డులో రయ్‌రయ్



నాడు గతుకుల మయమైన రోడ్డు


నేడు డబుల్ రోడ్డు నిర్మాణం

- మంత్రిపెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో డబుల్ రోడ్డు
- రూ.25 కోట్లతో 13 కిలోమీటర్ల మేర నిర్మాణం
- గత ప్రభుత్వంలో గతుకుల రోడ్డులో బస్సులు సైతం బంద్

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు–రొంపిచెర్ల రహదారి పూర్తి కావడంతో వాహనాలు రయ్‌రయ్‌మంటూ పరుగులు తీస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 13 కిలోమీటర్లు ఉన్న సింగిల్ రోడ్డు పూర్తిగా గతుకులమయమై దెబ్బతిన్నా అతీగతీ లేదు. అప్పట్లో రోడ్లు–భవనాల శాఖ అధికారులకు ప్రజలు విన్నవించిన వినతులు బుట్టదాఖలయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఎదురయ్యేవి. ప్రధానంగా రోడ్డు గతుకులుగా ఉండడంతో ఆర్టీసీ సర్వీసులను సైతం ఆపేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లకు మహర్దశ పట్టింది. ప్రజల ఇబ్బందులను గుర్తించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. దాదాపు రూ.25 కోట్ల వ్యయంతో 13 కిలో మీటర్ల ఈమార్గాన్ని డబుల్ రోడ్డుగా మార్చేగా చర్యలు తీసుకున్నారు. నిర్మాణం పూర్తి కావడంతో ప్రస్తుతం వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. చుట్టుపక్కల గ్రామస్తులకు ప్రధానంగా వైద్య సదుపాయాలకు వెళ్లే వారికి ఎంతో బాగా ఉపయోగపడుతోంది. ఈమార్గం తిరుపతికి వెళ్లేందుకు చాలా సౌకర్యవంతంగా మారింది.

చాలా సౌకర్యంగా ఉంది



గతంలో గతుకులమయమైన సింగిల్ రోడ్డుతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లు. వాహనదారులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. తిరుపతికి ఆస్పత్రికి వెళ్లాలంటే నరకం చూశాం. ప్రస్తుతం డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడంతో చాలా సౌకర్యవంతంగా ఉంది.

టీఎస్ ఖాదర్‌బాషా, కల్లూరు

ఎన్నో ఏళ్ల సమస్య తీరింది



గత ప్రభుత్వంలో దెబ్బతిన్న కల్లూరు–రొంపిచెర్ల రోడ్డును పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రోడ్లకు మహర్దశ వచ్చింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డబుల్ రోడ్డుగా మార్చారు. ఇప్పుడు వాహనదారులకు హాయిగా వెళుతున్నారు.

- సి.వీరయ్య, ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె